క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజుతో మల్లికార్జునుడు

పాలకొల్లు సెంట్రల్: వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన వీరా మల్లికార్జునుడు శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రసాదరాజు మాట్లాడుతూ సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఆయన వెంట జోగాడ ఉమామహేశ్వరరావు, దేవ రాజేష్, మామిడిశెట్టి చిట్టిబాబు, రామానుజుల చిన్నమధు ఉన్నారు.

ఎల్ఆర్ఎస్ స్కీమ్ ద్వారా క్రమబద్ధీకరణ

పాలకొల్లు సెంట్రల్: అనధికార లే అవుట్ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను కల్పించిందని మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి శుక్రవారం తెలిపారు. పట్టణ పరిధిలో 30 జూన్ 2025 నాటికి ముందుగా రిజిస్ట్రేషన్లు జరిగిన అనధికార లే అవుట్లకు ఈ అవకాశం కల్పించిందన్నారు. ప్రజలు ఈ ఎల్ఆర్ఎస్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకుని తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. క్రమబద్ధీకరణ చేయించుకోకపోతే అనధికార లే అవుట్ ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ఈ తరహా ప్లాట్లకు బ్యాంకులు రుణాలు కూడా ఇవ్వవని తెలిపారు. అలాగే ముఖ్యమైన మౌలిక సదుపాయాలు కూడా మంజూరయ్యే అవకాశం ఉండదన్నారు. పూర్తి వివరాలు కోసం మునిసిపల్ పట్టణ ప్రణాళిక విభాగంలో కానీ, సచివాలయాల్లోని వార్డు ప్లానింగ్ సెక్రటరీలను సంప్రదించాలని సూచించారు.

శ్మశానవాటికలో చెత్త తొలగింపు



సిద్ధాంతం శ్మశాన వాటిక నుంచి చెత్తను తొలగిస్తున్న అధికారులు

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం శ్మశాన వాటిక దుస్థితిపై ఇటు పత్రికల్లోనూ, అటు సోషల్ మీడియాలోనూ దుమ్మెత్తి పోయడంతో అధికారులు స్పందించారు. వడలి గ్రామానికి చెందిన విశ్రాంత రైల్వే ఎంప్లాయ్ నెక్కంటి సూర్యనాగేశ్వరరావు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు, సోషల్ మీడియాలోనూ విపరీతంగా ట్రోల్ చేశారు. దీంతో పాటు పత్రికల్లోనూ దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్మశాన వాటికలో డంపింగ్‌యార్డులా మారిన దుస్థితితో వెలువడుతున్న దుర్వాసనపై కథనాలు రావడంతో సిద్ధాంతం పంచాయతీ అధికారులు ఎట్టకేలకు స్పందించి తాత్కాలిక ఉపశమన చర్యలు చేపట్టారు. చెత్తను తొలగించడానికి శ్రీకారం చుట్టారు. శుక్రవారం కార్మికుల ద్వారా చెత్తను ఆ ప్రాంతం నుంచి తీసివేయిస్తున్నారు.

నేటి నుంచి సీతారామపురంలో విద్యుత్ రూరల్ సెక్షన్ సేవలు

నరసాపురం రూరల్: నరసాపురం గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇప్పటి వరకూ సేవలందించిన నరసాపురం రూరల్ సెక్షన్ ఆఫీసును మండలంలోని సీతారాపురం గ్రామంలోని సబ్ స్టేషన్ వద్దకు మార్చినట్లు ఆశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.మధుకుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ శాఖ సంస్కరణల్లో భాగంగా లైన్ ఇన్, లైన్ అవుట్ పనుల నిమిత్తం ఇప్పటి వరకూ పట్టణంలో ఉన్న ఈ కేంద్రాన్ని సీతారాంపురానికి మార్చినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

జోగాడకు మదర్ థెరిస్సా జాతీయ పురస్కారం



పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన రాహుల్ సామాజిక సేవా సంస్థ వృద్ధాశ్రమం నిర్వాహకుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు జోగాడ ఉమామహేశ్వరరావు మదర్‌థెరిస్సా జాతీయ పురస్కారం అందుకోనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు వచ్చినట్లు ఉమామహేశ్వరరావు విలేకరులకు తెలిపారు. మదర్‌థెరిస్సా ఎడ్యుకేషన్ సొసైటీ 17వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఈ పురస్కారం ఇవ్వనున్నట్లు తెలిపారు.

కుళాయిల నుంచి మురుగునీటి సరఫరా

నరసాపురం: పట్టణంలోని 31వ వార్డు చినమామిడిపల్లి, 30వవార్డు స్టేషన్‌పేట, జవదాలపేట ప్రాంతాల్లో కుళాయిల నుంచి గత కొన్ని నెలలుగా మురుగునీరు వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదు నెలలుగా ఇదే పరిస్థితి ఉందని వాపోతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని చెబుతున్నారు. క్లోరినేషన్ సరిగ్గా నిర్వహించకుండానే కాలువ నీటిని అలాగే వదిలేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

ఆ రోడ్లకు మోక్షం ఎప్పుడో?



ఆచంట కచేరీ సెంటర్ నుంచి ఆచంట వేమవరం వెళ్లే రహదారి దుస్థితి

పెనుగొండ: నియోజకవర్గంలోని రోడ్లు ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్నాయి. గోతులమయమై వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నా, నిర్మాణాలు జరిగి నాలుగైదు దశాబ్దాలు దాటుతున్నా ఆ రోడ్లకు మోక్షం కలగడం లేదు. ఆ రోడ్ల నిర్మాణం, మరమ్మతులు శాపంగా మారాయి. ఆచంట నియోజకవర్గంలో ఆచంటలో ఆచంట కచేరీ సెంటర్ నుంచి ఆచంట వేమవరం వెళ్లే రహదారిలో మండల కేంద్రం ఆచంటలోని రోడ్డు దుస్థితిని చూసి స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. అలాగే నియోజకవర్గంలోని అతి ప్రధానమైన పెనుగొండ పట్టణంలోని వంతెన వీధి రహదారిలో వెళ్లాలంటే ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఈ రెండు రోడ్లను అభివృద్ధి చేయడం ఉన్నత ప్రజా ప్రతినిధులకు తలనొప్పిగా మారింది. దీంతో గోతుల మయంగా మారిన ఆ రహదారుల్లో ప్రజలు పడుతూ లేస్తూ ప్రయాణాలు చేయాల్సి వస్తుంది.

ఆచంట కచేరీ నుంచి ఇలా..

ప్రధాన కూడలి అయిన ఆచంట కచేరీ నుంచి ఆచంట వేమవరం వెళ్లడానికి రహదారి ఉంది. రహదారి మొదట్లోనే గోతులు వెక్కిరిస్తున్నాయి. ఈ రహదారికి సుమారు 500 మీటర్లు పొడవు ఉంటుంది. ఈ చిన్న రోడ్డును కనీసం మరమ్మతులు చేయాలని ఎన్నో సార్లు ఉన్నత ప్రజా ప్రతినిధులకు ఆయా ప్రాంతాల ప్రజలు విన్నవించుకున్నా ఫలితంలేకుండా పోయింది. ఈ రహదారిలో నిత్యం వందలాది వాహనాలు, ప్రయాణికులు ప్రయాణిస్తూ ఉంటారు. పాలకొల్లు వెళ్లడానికి, ఆచంట వేమవరం, గుమ్ములూరు, పెనుమదం వంటి గ్రామాలకు ఇదే రహదారిలో ప్రయాణిస్తూంటారు. అలాంటి రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో వారి వెతలు వర్ణనాతీతంగా మారాయి. ఇటీవల రహదారి నిర్మాణం చేయడానికి నిధులు మంజూరైనా రోడ్డు వేయడానికి వీలు లేని విధంగా ఆక్రమణలు ఉండడంతో రహదారి నిర్మాణానికి చేతులు ఎత్తేశారు. దీంతో రహదారి నిర్మాణం కలగానే మిగిలిపోయింది.

పెనుగొండ వంతెన వీధి

పెనుగొండలో ప్రధానమైన రహదారుల్లో వంతెన వీధి ఒకటి, ఈ వీధికి శాపం రహదారి ఆర్ అండ్‌బీలో ఉందా? పంచాయతీ పరిధిలో ఉందా అన్న మీమాంసలో అభివృద్ధికి నోచుకోకుండా పోయింది. సిద్ధాంతం రామేశ్వరం రహదారిలో వంతెన వీధి ఉందని కొందరు అధికారులు వాదించి గాలికొదిలేశారు. అబ్బే పంచాయతీ రహదారి అంటూ ఆర్అండ్‌బీ అధికారులూ వదిలవేశారు. దీంతో రోడ్డు నిర్మాణం కలగానే మిగిలిపోతుంది. గతంలో నిర్మాణానికి ప్రయత్నం చేసినా స్థానిక అధికారులు సహకరించకపోవడంతో అభివృద్ధికి నోచుకోలేదు. ఇటీవల కాలంలో మే నెలలోపులోనే రహదారి నిర్మాణం పూర్తి చేస్తామంటూ స్థానిక ప్రజా ప్రతినిధులు హామీలు ఇచ్చినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉండిపోయింది. దీంతో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు వంతెన దిగువలో చెరువులా తయారై రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించి రహదారి నిర్మాణాలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



పెనుగొండలో ప్రధానమైన రహదారి వంతెన వీధి ఇలా



పెనుగొండ వంతెన వీధి వద్ద రోజుల తరబడి నిలిచిపోతున్న వర్షపు నీరు

ఊపిరితిత్తుల క్యాన్సర్‌పై అప్రమత్తత అవసరం



లంగ్ క్యాన్సర్ అంశంపై జరిగిన అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ పద్మావతి

నరసాపురం: ఊపిరితిత్తుల క్యాన్సర్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని అశ్విని ఆసుపత్రి వైద్యురాలు మాదంశెట్టి పద్మావతి సూచించారు. శుక్రవారం ప్రపంచ లంగ్ క్యాన్సర్ డేను పురస్కరించుకుని స్థానిక శ్రీసూర్యా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె మాట్లాడారు. లంగ్ క్యాన్సర్ వ్యాప్తిలో ప్రపంచంలో మనదేశం ద్వితీయ స్థానంలో ఉందన్నారు. ముఖ్యంగా ధూమపానం కారణంగా ఈ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయని చెప్పారు. విద్యార్థులు ధూమపానం లాంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాలలో లంగ్ క్యాన్సర్‌పై పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఘంటశాల బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని కాపవరం గ్రామంలో శుక్రవారం పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వీరి నుంచి రూ. 2900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మూర్తి వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మంత్రి గారూ.. ఈ శ్రావణంలోనైనా టిడ్కో ఇళ్లు ఇస్తారా?

పాలకొల్లు సెంట్రల్: మంత్రి నిమ్మల రామానాయుడు శ్రావణమాసంలో టిడ్కో గృహాల పంపిణీ హామీని ఈ శ్రావణమాసంలోనైనా ఇస్తానని చెప్పే దమ్ముందా? అని నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) సవాల్ విసిరారు. శుక్రవారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పెన్మెత్స ఏసురాజు అధ్యక్షతన బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి గుడాల గోపి మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ హయాంలో ఇచ్చిన నిధులకు దిమ్మలు కట్టుకుంటూ పోతున్నారు తప్ప ఏమి అభివృద్ధి చేశారో? చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశం అనంతరం రీకాలింగ్ బాబూస్ మేనిఫెస్టో పేరుతో స్కానర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు గుణ్ణం నాగబాబు, చెల్లెం ఆనందప్రకాష్, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజులునాయుడు, యడ్ల తాతాజీ, కుమారదత్తాత్రేయ వర్మ, ఉచ్చుల స్టాలిన్, మద్దా చంద్రకళ, విన్‌స్టన్‌బాబు, కవురు రాంపండు, పడవల సునీల్, మైలాబత్తుల మైఖేల్‌రాజు, అన్నాబత్తుల నాగేశ్వరరావు, పానుకుమట్ల వీరాస్వామి, చింతపల్లి సాయిబాబు, ఏనుగుపల్లి చంద్రశేఖర్, చేరుగొండి కిషోర్, తండా ఇస్సాక్‌రాజు, వర్ధినీడి విజయ్, కవురు సత్యనారాయణ, గుమ్మాపు పెద్దిరాజు, చింతపల్లి గురుప్రసాద్, సప్పవరపు ప్రసాద్, కర్రి జోగయ్య, కైలా సింహాచలం, మన్నే కోటేశ్వరరావు, కడలి శ్రీనివాస్, యాండ్ర గోపి, నాగేంద్ర, బొడ్డేటి సూర్యనారాయణ పాల్గొన్నారు.



రీకాలింగ్ బాబూస్ మేనిఫెస్టో స్కానర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రసాదరాజు, గుడాల గోపి, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పింఛన్ల పంపిణీలో ప్రొటోకాల్ ఉల్లంఘన

యలమంచిలి: ఎంపీపీకి కనీస సమాచారం ఇవ్వకుండా మండల పరిషత్ కార్యాలయం వద్ద కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్లు కూటమి నాయకులు శుక్రవారం పంపిణీ చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు. 2023 డిసెంబర్ నుంచి అక్టోబర్ 2024 వరకు పింఛను తీసుకుంటూ చనిపోయిన వ్యక్తుల భార్యలకు మాత్రమే స్పౌజ్ పింఛన్లు ఇచ్చారు. గ్రామాల్లో అయితే మిగిలిన పింఛన్ లబ్ధిదారులు తమ పింఛన్లు గురించి ఎక్కడ ప్రశ్నిస్తారో? అనే భయంతో కూటమి నాయకులు ఈ స్పౌజ్ పింఛన్లు గ్రామాల్లో కాకుండా మండల పరిషత్ కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. అయితే ఈ అధికారిక కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహిస్తూ ఎంపీపీకి కనీస సమాచారం ఇవ్వకుండా అధికారులు ప్రొటోకాల్ ఉల్లఘించారు. దీనిపై ఇన్‌చార్జి ఎంపీడీఓ జేడీవీ ప్రసాద్ వివరణ కోరగా నేను దీనిపై సమాధానం చెప్పలేనని చెప్పడం కొసమెరుపు.



స్పౌజ్ పింఛన్లు పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

పెనుగొండలో..

పెనుగొండ: మండలంలోని వడలిలో శుక్రవారం ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ స్పౌజ్ పింఛన్లను పంపిణీ చేశారు. అలాగే పెనుగొండలో సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ పింఛన్లు పంపిణీ చేశారు.

తల్లి పాలతో బిడ్డకు సంపూర్ణ రక్షణ



పెనుగొండ: వెంకట్రామపురంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్న దృశ్యం



పెనుమంట్ర: నత్తారామేశ్వరంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ కృష్ణకుమారి

పెనుగొండ: తల్లి పాలు బిడ్డకు రోగ నిరోధక శక్తి పెంపొందించి రక్షణగా నిలుస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.సుజాత అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రామపురం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడుతూ ప్రసవించిన గంటలోపునే తల్లి బిడ్డకు పాలను పట్టాలన్నారు. దీని వల్ల మొండి రోగాల నిరోధానికి రక్షణగా ఉంటాయన్నారు. తల్లిపాల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌వీ వైవీ అనంతలక్ష్మీ, పీహెచ్ఎన్ సుగుణ బాయ్, సీహెచ్ఓ భవానీ శంకర్, ఏఎన్ఎం జి.దుర్గ శ్యామల పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: పుట్టిన బిడ్డకు రోగ నిరోధక శక్తిని పెంచే తొలి టీకా తల్లిపాలేనని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎ.కృష్ణకుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని బట్టలమగుటూరు, నత్త రామేశ్వరం అంగన్‌వాడి కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణకుమారి మాట్లాడుతూ బిడ్డ శారీరిక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతగానో దోహద పడతాయని శిశువు జన్మించిన అరగంట లోపే మురుపాలు తప్పనిసరిగా తాగించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్.వెంకటలక్ష్మి, ఆయా కేంద్రాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పాలకొల్లు సెంట్రల్: ఎస్.చిక్కాలలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.చిక్కాలలో..

పాలకొల్లు సెంట్రల్: తల్లిపాలు వల్ల బిడ్డకు మంచి పౌష్టికాహారం అందుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.మంగ అన్నారు. శుక్రవారం మండలంలోని శివదేవుని చిక్కాల గ్రామంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగ మాట్లాడుతూ ఈ వారోత్సవాలు ఏడు రోజులు పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పిలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజగోపాల్

పాలకొల్లు సెంట్రల్: స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తామని మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ప్రజావేదిక ఆధ్వర్యంలో సీపీఎం నాయకులు జవ్వాది శ్రీనివాస్ అధ్యక్షతన మహిళా మండల భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో రాజగోపాల్ మాట్లాడుతూ ఈ నెల 5న మండల ఆఫీస్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్లు బిగించడంతో వ్యాపార సంస్థలు అధిక బిల్లులతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యుత్ బిల్లులు పెరగడం వల్ల వినియోగదారులపై భారం పడుతుందన్నారు. ట్రూ అప్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అసలే బిల్లుల భారంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు రూ 12,771కోట్లు ట్రూ అప్ భారం వేయడానికి సిద్ధపడడం దారుణమని అన్నారు. సమావేశంలో దేవ సుధాకర్, టి.గంగరాజు, యాకల్ రాము, వై.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

13న బార్ అసోసియేషన్ ఎన్నికలు

నరసాపురం: నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 13వతేదీన నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది నల్లిమిల్లి జోసఫ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 4నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని వివరించారు. 4, 5 తేదీల్లో రెండు రోజుల పాటు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటలు వరకూ అర్హులైన న్యాయవాదుల నుంచి నామినేషన్స్ స్వీకరిస్తామని స్పష్టం చేశారు. 6న ఉదయం 11 గంలు నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు నామినేషన్స్ పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. 7న ఉదయం 10.30 గంటలు నుంచి సాయంత్రం 4 గంటలు వరకూ నామినేషన్స్ ఉపసంహరణకు సమయం ఉంటుందని వివరించారు. 13న ఉదయం 10.30 గంటల నుంచి పోలింగ్, తరువాత కౌంటింగ్ ఎన్నికైన పాలకవర్గాన్ని ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

యలమంచిలి: శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాలు మహిళా భక్తులతో కిక్కిరిశాయి. గ్రామ దేవత పుంతల ముసలమ్మ వారిని భక్తులు 2160 గాజులతో అలంకరించారు. అమ్మవారితోపాటు ఆలయ ప్రాంగణాన్ని కూడా గాజులతో అలంకరించారు. ఈ సందర్భంగా మహిళ భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద మహిళలంతా కలిసి సామూహిక లలిత సహస్ర నామ పారాయణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులందరికీ తీర్థప్రసాద వితరణ చేశారు.

ఆకట్టుకున్న అలంకరణ

పెనుమంట్ర: శ్రావణమాస శుక్రవారం సందర్భంగా వివిధ దేవాలయాలలో అమ్మవార్లను హరిద్రఖండాలంకరణ(పసుపుకొమ్ములు)లతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా పసుపు కొమ్ములను మాలగా కట్టి, ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అమ్మవార్లకు అలంకరణ చేశారు. మార్టేరులో గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారిని, శివరావుపేటలోని శ్రీకనకదుర్గమ్మ అమ్మవారిని శ్రీభద్రాద్రి రామాలయ ఆవరణలో శ్రీమహాలక్ష్మి అమ్మవార్లను హరిద్రఖండాలతో అలంకరించారు. పెనుమంట్ర గ్రామదేవత శ్రీకనకదుర్గమ్మ అమ్మవారికి ఆలయ అర్చకులు సన్నిధిరాజు రాంబాబు ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు.



యలమంచిలి: గాజుల అలంకరణలో పుంతలో ముసలమ్మ



పెనుగొండ: గాజుల అలంకరణలో కామాక్షమ్మ



పెనుమంట్ర: మార్టేరు శివరావుపేటలో పసుపు కొమ్ముల అలంకరణలో కనకదుర్గమ్మ

పెనుగొండలో..

పెనుగొండ: శ్రావణ శుక్రవారం సందర్భంగా పెనుగొండలోని కామాక్షీ సమేత ఏకాంబరేశ్వర స్వామి ఆలయంలో కామాక్షీ దేవిని గాజులతో అలంకరించారు. ఉదయం నుంచి కేవీ సూర్యనారాయణ మూర్తి అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం కామాక్షీ దేవిని గాజులతో అలంకరించి, భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.